# తెలంగాణలో గెలిచేది బీఆర్‌ఎస్సే

**రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**



మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పోలేపల్లితండా గిరిజనులు

బొంరాస్‌పేట, నవంబర్ 25 : రాష్ట్రంలో బీఆర్ ఎస్ గాలి వీస్తున్నదని మూడోసారి గెలిచి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొడుతారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం దుద్యాల మండలం పోలేపల్లి తండాకు చెందిన 50 మంది గిరిజనులు పట్నం మహేందర్‌రెడ్డి సోదరి నర్మదారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే కొడంగల్ మండలంలోని ఉడిమేశ్వరంలో 100 మంది ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ దెబ్బకు కొడంగల్‌లో కాంగ్రెస్ ఖాళీ అవుతున్నదని, నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో రూప్లానాయక్, లక్ష్మణ్ నాయక్, హనుమాన్ నాయక్, రాంసింగ్, రఘునాయక్, రవి, తులసీయా, శంకర్, రాహుల్, నెహ్రూ, హరి, సేవ్యా, కృష్ణ, వెంకట్, శ్రీను, వినోద్, హన్మంతు, మోహన్, నరేశ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చౌహాన్ అరుణాదేశు, బీఆర్‌ఎస్ దుద్యాల మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పోలేపల్లి సర్పంచ్ రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

# బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

ఆదిబట్ల, నవంబర్ 25 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ పార్టీలకు చెందిన 20 మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసేలా వారిని చైతన్య వంతులను చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఆలయ మాజీ చైర్మన్ వట్నాల జంగయ్య, అనిల్‌గౌడ్, యాదగిరిగౌడ్, శ్రీరాములుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, జూకంటి రాజుగౌడ్‌తో పాటు మరికొందరు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొప్పు జంగయ్య, ప్రధాన కార్యదర్శి పొట్టి శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతనోత్సాహం

**బీఆర్‌ఎస్‌లో చేరికల జోష్**

- మంత్రి, ఎమ్మెల్యేల సమక్షంలో కొనసాగుతున్న వలసలు
- ప్రగతి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..
- తిరుగులేని శక్తిగా అవతరిస్తున్న గులాబీ పార్టీ
- అయోమయంలో ప్రతిపక్షాలు

## గులాబీకి అనూహ్య మద్దతు



తాండూరు : ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

> కారుకు మద్దతుగా వివిధ కులసంఘాల ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నేతలు


తాండూరు, నవంబర్ 25: తాండూరు పట్టణం తో పాటు నియోజకవర్గంలో గులాబీ పార్టీ జోరు మీదున్నది. కారు స్పీడ్‌తో దూసుకు పోతున్నది. ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డితో పాటు పార్టీ శ్రేణులు చేస్తున్న ముమ్మర ప్రచారంతో బీఆర్‌ఎస్‌కు ప్రజలు అనూహ్య మద్దతు ఇస్తున్నారు. అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారు. కారుకు మద్దతుగా వివిధ కులసంఘాల ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారు. శనివారం తాండూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కారు గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. బంగారు తెలంగాణ సాధనకు, తాండూరు అభివృద్ధికి బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పార్టీలో చేరిన ప్రజలకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


**అభివృద్ధిని చూసి ఆదరించండి**

పెద్దేముల్ : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఆదరించి ఆశీర్వదించాలని తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని మంబాపూర్, మన్సాన్‌పల్లి, మారేపల్లి తండా, అడికిచెర్ల, నాగులపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇబ్రహీం, రవి నాయక్, పాండు, మాన్య నాయక్, జనార్దన్ రెడ్డి, మట్ట శ్రీను, శేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కొత్త వ్యక్తులు వచ్చి అమలు కాని హామీలను ఇచ్చే వారిని నమ్మవద్దని సూచించారు.

**కొర్విచేడ్‌లో..**

బషీరాబాద్ : మండల పరిధిలోని కొర్విచేడ్ గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఉన్న మేము ఆదరణ లేక అవమానాల పాలై ఇబ్బందులు పడ్డామన్నారు. తల దించుకొని కాంగ్రెస్‌లో ఉండటం ఇష్టం లేక తలెత్తుకొని గర్వంగా నిలబడేందుకు బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నామన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నవీన్‌రెడ్డి, తిరుపతి, మల్కప్ప, మొగులప్ప, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు

# సీఎం కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

**ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

ధారూరు, నవంబరు 25 : తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని నాగారం, కుమ్మరిపల్లి, ఎబ్బనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు రాఘవేందర్ రెడ్డి, యువకులు తదితరులు ఉన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- గచ్చిబౌలిలో ఓటరు చైతన్య 5కే రన్

శేరిలింగంపల్లి, నవంబర్ 25 : కులం, మతం, జాతి, ప్రాంతం వంటి ప్రలోభాలకు గురవ్వకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో 'లెట్స్ ఓట్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఓటరు చైతన్య అవగాహన 5కే రన్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిలతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ప్రాముఖ్యత కలిగినదన్నారు. అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఓటు ప్రాముఖ్యతను గుర్తించి అర్హులైన అందరూ ఎన్నికల్లో ఓటు వేసేలా చైతన్యపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 30వ తేదీన ఎన్నికల సెలవు ఇంట్లో ఉండేందుకు కాదని, బయటకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకని సూచించారు. స్వచ్ఛందంగా ఓటు వేసి మనందరం దేశం పట్ల ప్రేమ, అభిమానం చాటుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బాధ్యతాయుత పౌరులుగా యువతీయువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వివిధ ఐటీ సంస్థల ఉద్యోగులు, పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.